ప్రజాశక్తి
ఆదివారం 29 డిసెంబర్ 2024
5
విజయనగరం

3న 3,857 గృహ ప్రవేశాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 3న భారీగా గృహ ప్రవేశాల్లో భాగంగా జిల్లాలో 3,857 గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. పూర్తయిన ఇళ్లకు సంబంధించి చిన్నచిన్న పనులు ఏవైనా మిగిలి వుంటే వెంటనే వాటిని పూర్తిచేసి అన్ని వసతులతో ప్రవేశాలకు సిద్ధంచేయాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని గృహనిర్మాణ శాఖ ఎఇ, డిఇలతో కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రారంభించే ఇళ్లన్నింటినీ ఎఇ, డిఇలు తనిఖీ చేయాలన్నారు. గ్రామాల వారీగా ప్రారంభించే ఇళ్ల జాబితాను ఆయా ప్రాంత ప్రజాప్రతినిధులకు అందజేయాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులకు సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ కూర్మినాయుడు, ఇఇ శ్రీనివాస్, డిఇ మురళి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు తప్పని కష్టాలు

- వరి రైతులను దెబ్బతీసిన వర్షాలు
- పత్తికి కొరవడిన మార్కెట్, మద్దతు ధర
- చెరకు రైతులకు కొనసాగిన చేదు అనుభవం
- అపరాలూ వర్షార్పణం

సకాలంలో తొలకరి పలకరింపు... పంట చేతికందే సమయంలో వర్షాలు.. పెరిగిన సాగుపెట్టుబడి... అందని ప్రభుత్వ సాయం... పత్తికి మార్కెట్ సదుపాయం కల్పించకపోవడం, ఆపై మద్దతు ధరా అంతంతమాత్రం. చెరకు ఫ్యాక్టరీల మూత వెరసి జిల్లాలో సగటు రైతు కుటుంబాలకు కష్టనష్టాలు తప్పలేదు. మునుపెన్నడూ లేనంతగా వరి దిగుబడి వచ్చినప్పటికీ చివరి క్షణాల్లో ప్రకృతి కన్నెర్ర చేయడంతో తిరిగి నష్టాల ఊబిలో కూరుకుపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా రబీ సీజన్‌లో వేసిన అపరాలు కూడా గంగార్పణమయ్యాయి. వరి మినహా చెరకు, మొక్కజొన్న, పత్తి, నువ్వులు సహా మిగిలిన అన్నిపంటల విస్తీర్ణం ఈ ఏడాది స్వల్పంగా తగ్గింది.

ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పనలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో పెద్దగా సాగునీటి వనరులు లేకపోవడం వల్ల రైతాంగం ఖరీఫ్ సీజన్ పైనే ఆధారపడుతుంది. ఇందులోనూ వరి సాగు అత్యధికం. ఆ తరువాత స్థానంలో మొక్కజొన్న, పత్తి, చెరకు, అపరాలు వంటివి ఉంటాయి. ఈ ఏడాది వరి 2,40,580 ఎకరాల్లో సాగైంది. గత ఏడాదితో పోలిస్తే సుమారు 8వేల ఎకరాల మేర విస్తీర్ణం పెరిగింది. పదేళ్లతో పోలిస్తే ఈసారి సీజన్ ప్రారంభం జూన్ నుంచే వర్షాలు అనుకూలించాయి. దీంతో, నారుమడులు సిద్ధం చేసుకోవడం మొదలుకుని, నారుపోత, నాట్లు సకాలంలోనే పడ్డాయి. సరిగ్గా దుబ్బుకట్టే సమయంలో (ఆగస్టులో) కాస్త నీటి ఎద్దడి ఏర్పడినప్పటికీ రైతులు నీటి ఇంజిన్లు పెట్టుకుని పంటను రక్షించుకున్నారు. ఇందుకోసం అదనపు పెట్టుబడి అయ్యింది. ఆ తరువాత వర్షాలు అనుకూలించడంతో నమ్మకమైన పంట పండింది. ఇప్పటి వరకు 90శాతం పంటకోత ప్రయోగాలు పూర్తికాగా సగటు ఎకరాకు 30బస్తాల ధాన్యం దిగుబడి వచ్చినట్టు అధికారులు అంచనాలు వేశారు. కాదు పోదూ అంటే 30బస్తాలకు తగ్గే పరిస్థితి లేదని కూడా అధికార యంత్రాంగం చెబుతోంది. గత ఏడాది 28బస్తాల దిగుబడి వచ్చింది. ఈ సారి 2బస్తాల దిగుబడి వచ్చినట్టు లెక్క. దీంతో, రైతులు ఒకింత ఆనందం వ్యక్తం చేశారు. సరిగా వరికోతలు చేపట్టి పంట కొచ్చే సమయంలో ఈనెలలో గడిచిన వారంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం 1590 ఎకరాల్లో నష్టం మిగిల్చింది. మరికొంత విస్తీర్ణంలో ధాన్యం రంగు మారాయి. పెట్టుబడికి తగిన మద్దతు ధర కూడా లేదు. అయితే, ముందస్తుగా నూర్పులు జరిపినవారు మాత్రం నష్టాల నుంచి బయట పడ్డారు.

పత్తి గత ఏడాది 4,529ఎకరాల్లో సాగవ్వగా, ఈ ఏడాది 4,381 ఎకరాల్లో సాగైంది. 148 ఎకరాల్లో సాగు తగ్గినప్పటికీ, దిగుబడి బాగానే వచ్చింది. మార్కెట్ సదుపాయం, మద్దతు ధర తగినంత లేకపోవడం వల్ల తేరుకోలేని నష్టాన్ని చవిచూశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు రామభద్రపురం మండలంలో ఒకే ఒక్క కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడికి తీసుకెళ్లేందుకు రైతులు వ్యయప్రయాసలకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. దీనికితోడు ఇ-క్రాప్‌లో నమోదు కాకపోవడం వల్ల చాలామంది రైతులు ప్రభుత్వానికి విక్రయించుకోలేని దుస్థితి ఏర్పడింది. దీంతో, అనివార్యంగా ప్రైవేటు వ్యాపారులకు రూ.6వేల నుంచి రూ.6,300లకు విక్రయించుకోవాల్సి వచ్చింది. ఒకానొక దశలో రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వానికిగానీ, అధికార యంత్రాంగానికి గానీ పట్టలేదు.

మొక్కజొన్న గత ఏడాది 25,397 ఎకరాల్లో సాగవ్వగా ఈ ఏడాది 24,135 ఎకరాల్లోనే పడింది. 1262 ఎకరాల్లో తగ్గింది. ఈ పంటకు కూడా మార్కెట్ సదుపాయం, మద్ధతు ధర తగినంతగా లేకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులనే ఆశ్రయించారు. చెరకు గత ఏడాది 8,078 ఎకరాల్లో సాగవ్వగా ఈ ఏడాది 7,275 ఎకరాల్లోనే మాత్రమే ఉంది. ఆధునీకరణ పేరిట భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ మూత, నష్టాలపేరిట లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ మూసివేత కారణంగా రైతులు సాగును తగ్గించుకున్నారు. పండిన మేర విక్రయించుకోవడం సవాలుగానే మారి పోయింది. సుమారు 70 నుంచి 100కిలో మీటర్ల దూరంలోని రేగిడి మండలం సంకిలి సుగర్‌ఫ్యాక్టరీకి తీసుకెళ్లాల్సి వచ్చింది. రవాణా భారం వల్ల రైతులకు మద్దతు ధర పలకలేదు. చెరకుతోపాటు నువ్వులు, వేరుశనగ సహా మిగిలిన పంటల విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే తగ్గింది.

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దినకర్

స్వర్ణాంధ్ర సాధన దిశగా అడుగులు

- ఉపాధి కల్పించి ప్రజల ఆదాయాన్ని పెంచాలి
- నైపుణ్య శిక్షణకు పెద్దపీట వేయాలి
- 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంకా దినకర్
- ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వ పథకాలను సక్రమంగా వినియోగించుకొని స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా అడుగులు వేయాలని 20 సూత్రాల కార్యక్రమం చైర్మన్ లంక దినకర్ పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చేసిన ఆయన, శనివారం కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లాకు సంబంధించిన అంశాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఉపాధిహామీ కాంపోనెంట్ నిధులను మార్చిలోపు శతశాతం వినియోగించు కొనేందుకు కృషి చేస్తామన్నారు. రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని చెప్పారు. జిల్లాలోని ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు సుమారు 51వేల మంది ఉన్నారని, వీరందరి ఇళ్లకు పిఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ విద్యుత్ అందించేందుకు ప్రణాళికను రూపొందించామని చెప్పారు. ఈ సందర్భంగా ఛైర్మన్ దినకర్ మాట్లాడుతూ, విజయనగరం లాంటి వెనుకబడిన జిల్లాలు అభివద్ధిలో భాగస్వామ్యమైనప్పుడే, లక్ష్యం నెరవేరుతుందని, ఆ దిశగా ప్రభుత్వ శాఖలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఉపాధిహామీ పథకం అమల్లో భాగంగా మరింత ఎక్కువ మందికి వంద రోజుల పనిదినాలను కల్పించాలని, అలాగే సగటు వేతనాన్ని రూ.300కు పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సుమారు రూ.1000 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ నిధులు మురిగిపోయాయని చెప్పారు. ఈ పరిస్థితి పునరావతం కాకుండా వచ్చే ఏడాది నుంచి ఏప్రెల్ నెల నుంచే మెటీరియల్ కాంపోనెంట్ నిధుల వినియోగాన్ని ప్రారంభించాలని సూచించారు.

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని, దాని అవసరాలకు తగ్గట్టుగా స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు సిద్ధం చేయాలని ఛైర్మన్ సూచించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయితే, తాటిపూడి నీటిని పూర్తిగా జిల్లాలోనే వినియోగించుకొనే అవకాశం లభిస్తుందన్నారు. గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం క్రింద పేద ప్రజలకు బియ్యం పంపిణీ చేస్తున్నామని, అయితే తెల్లకార్డుల జారీలో పలు సంస్కరణలను చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయడంతోపాటుగా, యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే కార్యక్రమాలపై దష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఎంఎల్‌ఏలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగ మాధవి, ఎంఎల్‌సి ఇందుకూరి రఘురాజు, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ ఛైర్ పర్సన్ కావలి గ్రీష్మ, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, తూర్పుకాపు ఛైర్‌పర్సన్ పాలవలస యశశ్వని, ఆర్‌టిసి ప్రాంతీయ ఛైర్మన్ దొన్ను దొర మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.బాలాజీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

1 నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం

వ్యాపారుల సమావేశంలో కమిషనర్ నల్లనయ్య

ప్రజాశకి-విజయనగరం టౌన్

నగరంలో జనవరి ఒకటో తేదీ నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామనినగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. శనివారం తన ఛాంబర్ లో రిటైల్, హోల్‌సేల్ ప్లాస్టిక్ విక్రేతలతో సమావేశమయ్యారు. సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి విక్రయదారులు పరిపూర్ణ సహకారం అందించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో విక్రయదారులకు ఉన్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మానవాళి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని నగరం నుండి తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వస్తువులు కచ్చితంగా నిషేధిస్తున్నామని, 120 మైక్రాన్ల కన్నా ఎక్కువ ఉన్నా గాని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను కూడా విక్రయించరాదని తెలిపారు. విక్రయదారులకు ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను గూర్చి వివరించారు. ప్రస్తుతం ప్రత్యేక ప్రత్యామ్నాయ వస్తువులు అందుబాటులోకి వచ్చాయని, వాటివల్ల పర్యావరణానికి ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. ఇక నుంచి ప్రతిరోజు ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రవిశేఖర్, ప్లాస్టిక్ విక్రయదారులు పాల్గొన్నారు.

అమిత్‌షా బర్తరఫ్‌కు 30న నిరసనలు

వామపక్ష నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న జిల్లాలో అన్ని మండల, ప్రధాన కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు తెలిపారు. శనివారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంబేద్కర్ పేరు కంటే దేవుడిని తలచుకుంటే పుణ్యం వస్తుందని అమిత్ షా అనడం అంటే రాజ్యాంగాన్ని అవమానించడమేనని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకులు రాజ్యాంగ నిర్మాతను అవమానించే విధంగా వ్యవహరిస్తు న్నారని అన్నారు. ప్రపంచానికి ఆదర్శమైన రాజ్యాంగాన్ని రచించిన వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అంబేద్కర్ ను అవమానించడం అంటే దేశ ప్రజలను, రాజ్యాంగాన్ని అవమానించడమే అన్నారు. అదే రాజ్యాంగం లేకుంటే మీరు ఈ రోజు అనుభవిస్తున్న పదవులు దక్కేవా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ 30 తేదిన జిల్లాలో అన్ని ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని, ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నిరసన కార్యక్రమాలు గోడ పత్రికను విడుదల చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్ వద్ద 30న నిరసన

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై రాజ్యసభలో అవమానకరమైన, వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా కోరుతూ ఈనెల 30న బొబ్బిలి ఎన్‌టిఆర్ బొమ్మ సెంటర్ వద్ద నిరసన చేపట్టనున్నామని వామపక్ష నాయకులు తెలిపారు. సిఐటియు కార్యాల యంలో శనివారం రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వి. వర్మ, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శంకర్రావు, సిపిఐ బొబ్బిలి పట్టణ కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు, అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు వెలగాడి కృష్ణ మాట్లాడారు. ఈ నిరసనలో అందరూ పాల్గొవాలని కోరారు. సమా వేశంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాల్, రామభద్రపురం మండల సిపిఎం నాయకులు బలస శ్రీను, కళాసి సంఘం కార్యదర్శి అడబాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు బాధ్యతగా పనిచేయాలి

రిఫరల్స్‌ను తగ్గించాలి : కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైద్యాధికారులు గ్రామాల్లో ఆరోగ్య పరిస్థితుల్ని తెలుసుకొని వాటికి తగ్గట్టుగా బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై అర్థం చేసుకోకుండా లేని పోని వదంతులను సృష్టించడం, ఏదైనా సంఘటన జరిగినా పక్కవారి మీద తోసేయడం వంటివి చేస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వైద్యాధికారులతో సమీక్షించారు. గత మూడు నెలలుగా డయేరియా అంశం జిల్లాను పట్టి పీడిస్తోందని, ప్రజల సందేహాలను నివృత్తి చేసేలా వాస్తవాలను వెల్లడించి నమ్మకం కలిగించాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగు నీరు , క్లోరినేషన్ , ఆరోగ్య పరిస్థితులపై దృష్టి పెట్టాలన్నారు. గుర్లలో డయేరియా అనంతరం జిల్లాలో డ్రైనేజిలలో నున్న పైప్ లైన్లనన్నిటినీ బయటకు తీశామని, ప్రస్తుతం నీటి కాలుష్యం అనేదే లేదని, ఇంకోసారి డయేరియాకు నీటి కాలుష్యం కారణంఅనే వార్త వినపడకూడదని తెలిపారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూసే బాధ్యత కూడా వైద్యాధికారులదేనని అన్నారు. ఆసుపత్రులకు వచ్చే వారిని తప్పనిసరి అయితేనే రెఫెర్ చేయాలనీ, రెఫరల్ కేసులు తగ్గాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్య తగా పని చేయాలనీ, వైద్యులపై ఫిర్యాదులు వస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఒ డాక్టర్ రాణి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి , జిజిహెచ్ మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్‌లు, పి హెచ్ సి, సిహెచ్‌సిల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి

విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తా

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

తనను గెలిపిస్తే విద్యారంగ పరిరక్షణకు, అధ్యాపక, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. దత్తిరాజేరు మండలంలోని గడసాం, దత్తిరాజేరు, దత్తి, రామచంద్రపురం, మరడాం ఉన్నత పాఠశాలలు, కెజిబివి, షికారుగంజి మోడల్ స్కూల్, దత్తిరాజేరు జూనియర్ కాలేజీ, మహాత్మాజ్యోతిబాపులే స్కూల్, మెంటాడ మండలంలోని మోడల్ స్కూల్, మేడపల్లి పాఠశాలలను శనివారం సందర్శించారు. ఉపాధ్యా యులను, అధ్యాపకులను కలిసి మద్దతు కోరారు. విద్యా రంగంపై సమగ్ర అవగాహన ఉన్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై నికరంగా, నిరంతరం పోరాడుతున్న తనకు ఓటు వేయాలని కోరారు. 117 జిఒ రద్దు, సిపిఎస్ రద్దు వంటి దీర్ఘకాలిక సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, కెజిబివి, మోడల్ స్కూలు, గురుకులాల ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ సాధనకై కృషి చేస్తానని తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు పిడిఎఫ్ ఎమ్మెల్సీలు చేస్తున్న పోరాటాలకు తోడ్పాటు అందించాలని కోరారు. పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న తమను గెలిపించాలని కోరారు.కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి చింత భాస్కర రావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి. రాంప్రసాద్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ కె.అప్పారావు, దత్తిరాజేరు మండల అధ్యక్షులు ఎమ్. చంద్రరావు, సీనియర్ నాయకులు వై. స్వామి నాయుడు, జి.గంగులు, ఎమ్. శివప్రసాదరావు, జి.వెంకటరావు, జి.పైడిరాజు పాల్గొన్నారు.

పిచ్చుకపై బ్రహ్మాస్త్రమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాకు చెందిన మంత్రి, అధికార పార్టీకి చెందిన నేతలు పిచ్చుకపై బహ్మాస్త్రం ప్రయోగిస్తున్నారన్న చర్చ జిల్లాలో జరుగుతోంది. చిరుద్యోగులు, స్కీమ్ వర్కర్లపై వేధింపులు రోజురోజుకూ పెరుగుతున్నాయని చెప్పు కుంటున్నారు. గజపతినగరం మండలం రామన్నపేట పాఠశాలలో శానిటరీ వర్కర్ తొలగింపు, అదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు మానాపురం సౌజన్య తొలగింపునకు ఇటీవల జరిగిన రాజకీయ విన్యాసాలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి. ఈ విషయంలో పార్టీ అనుయాయుల ప్రయోజనాల కోసమూ, రాజకీయంగా సంతృప్తి పర్చేందుకు, మంత్రి సహా గజపతినగరానికి మండలానికి చెందిన ఓ నాయకుడు ఎంతో 'మక్కువ' చూపించారనే విమర్శలు గుప్పు మంటున్నాయి. గత నెల 30న సౌజన్యను తొలగించారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అంగన్‌వాడీ ఆయా ఉద్యోగం పొందారన్నది మంత్రి అనుచరుల అభియోగం. అందుకు తగ్గట్టే అధికారులు కూడా నివేదికను తయారు చేసి, ఉన్నతాధికారులకు పంపి తొలగింపు చర్యలు చేపట్టారు. కానీ, రాజకీయ కక్ష సాధింపుతో తనను తొలగించారని బాధితురాలితోపాటు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకుల వాదన. జనంలో కూడా ఇదే రకమైన చర్చ నడుస్తోంది. అంతపెద్ద మంత్రి ఇంత చిన్న ఉద్యోగిపై అధికారం ప్రయోగిస్తారా? అంటూ మరికొంతమందిలో సందేహాలు వ్యక్తమౌతున్నాయి. మంత్రిగా ఇలాంటి పెద్దపెద్ద పనులు కూడా చేస్తున్నారా...! అంటూ వ్యంగ్యాస్త్రాలు కురిపించిన వారూ లేకపోలేదు. ఈ విషయం కాస్త అటుంచితే, తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో సౌజన్య అంగన్‌వాడీ సహాయకురాలిగా చేరారనేది అధికార పార్టీ నాయకులు సహా తొలగింపు ప్రక్రియలో అధికారులు చేస్తున్న వాదన. వాస్తవానికి ఈ వాదన ఇప్పటిది కాదు. రెండేళ్ల క్రితం ఇదే గ్రామం నుంచి ఇదే పోస్టుకు దరఖాస్తు చేసుకున్న ఓ మహిళ సౌజన్యపై నాటి కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. సౌజన్య తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం పొందారని, ఆమె రామన్నపేటలో లేదనేది అందులో సారంశం. నాటి ఫిర్యాదుపై అప్పటి గజపతినగరం సిడిపిఒ,

స్థానిక సూపర్‌వైజర్ విచారణ జరిపిన తరువాతే సౌజన్యను కొనసాగించారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక పాత ఫిర్యాదును మరోసారి తెరపైకి తెచ్చారు. ఇప్పుడు తొలగింపునకు 'మక్కువ' చూపుతున్న నేత అప్పట్లో వైసిపిలో ఉన్నారు. అప్పట్లో మంత్రిగారూ ఆ పార్టీలోనే ఉన్నారనుకోండీ అది వేరే సంగతి. బహుసా అందుకే అప్పట్లో ఏమీ చేయలేకపోయారేమో అని జనం చర్చించు కుంటున్నారు. విద్యార్హత లేనివారిని నియమించి నప్పుడు నాడు అధికార పార్టీలోనే ఉన్న ఆ నేతలు ఎందుకు మిన్నకుండిపోయారు? పోనీ, నాడు తప్పుడు నివేదికలు సమర్పించి, సౌజన్య నియామకానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోగలరా? అని జనం ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి మంత్రి లేదా ఆయనకు సన్నిహితంగా ఉన్నామని చెప్పుకుంటున్న ఆ నేతలకు రైతులు, కార్మికులు, తదితర తరగతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎందుకు పట్టడం లేదు?. అక్రమాల పేరిట అడ్డకట్ట వేయడానికి ఈ చిన్నపాటి గౌరవ వేతనంతో బతుకీడుస్తున్న అంగన్‌వాడీ ఆయానే దొరికిందా? అని జనం నోట వినిపిస్తున్న సందేహాలు. ఇందుకు కారణం లేకపోలేదు. అరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి కొనుగోలు కేంద్రాల్లో మూడు నుంచి ఐదు కేజీలు వరకు అధికంగా తీసుకుంటున్నారని, రైతులు, రైతు సంఘం నాయకులు 20రోజులుగా నెత్తీ నోరూ కొట్టుకుంటున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు వ్యాపారులు గ్రామాల్లో తక్కువ ధరకు కొనేస్తున్నారు. ఇంకా చెప్పాలంటే వైసిపి హయాంలో రాజకీయ వేధింపులతో ఉద్యోగాలు కోల్పోయిన వారూ లేకపోలేదు. తిరిగి ఉద్యోగంలో చేర్పించా లంటూ అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు.మంత్రిగారి నియోజకవర్గంలోనే ఓలమ్ జీడిపిక్కల ఫ్యాక్టరీలో వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఇటీవల ప్రభుత్వం ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీల భారంతో జిల్లాలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు తమ ఉత్పత్తిని తగ్గించుకోవడంతో మరింత మంది జీవనోపాధి కోల్పోయారు. చెరకు ఫ్యాక్టరీల మూతవల్ల ఆ రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. 'చిన్న పరిశ్రమల మంత్రిగా బొబ్బిలి గ్రోత్ సెంటర్, విజయనగరంలోని విటి అగ్రహారం, సారిపల్లి, కంటకాపల్లి వంటి పారిశ్రామికవాడల్లో కొత్త యూనిట్ల స్థాపనకు కృషి చేయవచ్చు. ఇందుకు వందలాది ప్లాట్లు ఖాళీగా ఉండనే ఉన్నాయి' అని జనం చర్చించుకుంటు న్నారు. ఆదిశగా మంత్రి ఆలోచించి ఉద్యోగాలు కల్పించాలి తప్ప ఉన్న ఉద్యోగాలను తీసేయడం వల్ల వారి పొట్టకొట్టడం తప్ప ఒనగూరిందేమీ లేదని అంటున్నారు. ఇటువంటి చర్యలు ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తాయని ఆ పార్టీ నాయకులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జెండా ఎగురవేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఘనంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థి ఉద్యమాల వేగుచుక్క ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం నగరంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రారంభ సూచికగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షులు సూరిబాబు పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవి కుమార్ మాట్లాడుతూ 1970లో తిరువనంతపురంలో ఏర్పడిన ఎస్‌ఎఫ్‌ఐ 54 సంవత్సరాలు పూర్తి చేసుకుని నేటితో 55వ వసంతం లోకి అడుగు పెడుతుందని తెలిపారు. ఈ 55 ఏళ్ల ప్రస్థానంలో అనేక త్యాగాలు , అనేక పోరాటాలతో ఈదేశ పోరాట చరిత్రలో తన గూర్చి సువర్ణ అక్షరాలతో లిఖించ గలిగిందన్నారు. దేహం ముక్కలైన దేశాన్ని ముక్కలు కానివ్వనని చెప్పి తన ప్రాణాలను దేశం కోసం తృణ ప్రాయంగా అర్పించిన 8 వ తరగతి విద్యార్థి నిరంజన్ తాలూక్ దార్ స్ఫూర్తితో నేటికీ అలుపెరుగని పోరాటాలు సాగిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో స్కాలర్ షిప్స్ సాధన , ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటు కోసం , సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు కల్పన కోసం ఎన్నో పోరాటాలు చేసి వాటిని సాధించుకోగలిగామని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై 55వ ఆవిర్భావ దినోత్సవ స్ఫూర్తితో పోరాటాలు రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి రమేష్, కె.రాజు, నాయకులు వాసు, రాహుల్ , మురళి పాల్గొన్నారు.

31న శ్రీకళాభారతిలో కళాజాతా

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక శ్రీకళా భారతిలో ఈనెల 31న కళాజాత నిర్వహించనున్నట్లు కళాభారతి కమిటీ కార్యదర్శి ఎన్. వేణుగోపాల్, బొబ్బిలి మల్టీ టాలెంట్ కన్వీనర్ విజయమోహన్ చెప్పారు. నూతన సంవత్సర వేడుకలలో భాగంగా కళా జాతర నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమాని ముఖ్య అతిథిగా లింగిడి లింగిడి పాట గాయకుడు రఘు, డప్పు శ్రీను హాజరవుతారని చెప్పారు. కళా జాతర సాయంత్రం 6 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో కళాకారులు, కలలను ప్రోత్సహించే వారిని సన్మానిస్తామని చెప్పారు.

ఆలిండియా పోటీలకు ఉపాధ్యాయుల ఎంపిక

ప్రజాశక్తి- డెంకాడ

ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీల్లో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. మండలంలోని గుణుపూర్ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గౌరీ శంకర్ కబడ్డీ, రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కూర్మాన భాను, సంతకవిటి మండలం మామిడిపల్లిలో సెకండ్ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్న నరేష్ కబడ్డీ పోటీల్లోనూ, పెదవేమలి వ్యాయామ ఉపాధ్యాయుడు కుమార్ ఖోఖోలో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెల మూడు నుంచి 8 వరకు ఢిల్లీలో జరగబోయే ఆలిండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ పోటీల్లో రాష్ట్ర జట్టు తరుపున వీరు పాల్గొంటారని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణంరాజు తెలిపారు.

పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పాటూరు ప్రాథమిక పాఠశాలను జిల్లా మానిటరింగ్ బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, తరగతి గది, డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజన పథకం, విద్యార్థుల సామర్థ్యాలు, విద్యార్థులు తయారు చేసిన టిఎంలను, వర్క్ బుక్కులను పరిశీలించారు. జిల్లా మానిటరింగ్ టీమ్ సభ్యుల్లో నెల్లిమర్ల డైట్ అధ్యాపకులు ఎం. రామకృష్ణ, వి.భారతి ఉండగా పాఠశాల కమిటీ చైర్మన్ వి.భాస్కరరావు, సిఆర్‌పిలు కోటీశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వారి వెంట ఉన్నారు.

వృత్తిదారులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి- బొబ్బిలి, నెల్లిమర్ల

మున్సిపాలిటీలో వివిధ రంగాలలో ప్రజలకు సేవలు అందిస్తున్న వృత్తిదారులకు మెప్మా ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు బొబ్బిలి కమిషనర్ ఎల్.రామలక్ష్మి, నెల్లిమర్ల కమిషనర్ అప్పలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబింగ్, ఎలక్ట్రిషియన్, పెయింటింగ్, కార్పెంటర్స్, ఏసీ, గ్రీజర్, టివి, వాషింగ్ మిషన్, రిఫ్రిజిరేటర్ మెకానిక్స్, బ్యూటీషియన్లకు ఉచిత శిక్షణ ఇచ్చి జీవనోపాధికి ప్లాట్ ఫామ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 28 నుంచి 31 లోగా మున్సిపల్ కార్యాలయానికి ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పూలంగి సేవకు విశేష స్పందన

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో కంచరవీధిలో ఉన్న శ్రీకళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నిర్వహించిన పూలంగి సేవకు విశేష స్పందన లభించింది. స్వామివారిని 15 రకాల బంతి, చేమంతి పువ్వులతో అలంకరించి అర్చకులు శ్రీనివాస్ పూజలు చేశారు. పూలంగి సేవకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికలు హాజరయ్యారు.

ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- తెర్లాం

మండలంలోని జగన్నాధవలస అంగన్వాడి కేంద్రంలో శనివారం సిడిపిఒ కె.రాజ్యలక్ష్మి ప్రీ స్కూలు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో గర్భిణులు, బాలింతలకు సకాలంలో ఫీడింగ్ ఇవ్వాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలతో పాటు ఇంటిదగ్గర తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రీస్కూల్ పిల్లలకు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బిఐకి సామాజిక బాధ్యత ఉంది

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఎస్‌బిఐకి వ్యాపారంతో పాటు సామాజిక బాధ్యత కూడా ఉందని ఎస్‌బిఐ విజయనగరం రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు అన్నారు. ఎస్‌బిఐ (ఆర్‌బిఒ) విజయనగరం ఆధ్వర్యంలో సామాజిక బాధ్యతలో (సిఎస్‌ఆర్)లో భాగంగా శనివారం పూసపాటిరేగ ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు రూ. 50 వేల విలువైన 10 సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బిఐ సామాజిక భాద్యతలో భాగంగా విద్యాలాయాలకు తమ వంతు సహకారం అందిస్తున్నామన్నారు. విజయనగరంలో జొన్నగుడ్డిలో మునిపల్ పాఠశాలను దత్తత తీసుకున్నామన్నారు. ఇంకా అవసరమైన వాటిని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్‌ఎం శంకరావుతో చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ నరేష్‌కృష్ణ, డెప్యూటీ మేనేజర్ జె. శ్రీను, పూసపాటిరేగ ఎస్‌బిఐ మేనేజర్ కె.మురళీ, పాఠశాల ఉపాధ్యాయులు ఇజ్జురోతు శేషసాయి విద్యార్థులు పాల్గొన్నారు.

కుళాయి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండల కేంద్రంలోని గోల్లపేటలో ఇంటింటి కుళాయి పనులు శనివారం ప్రారంభమయ్యాయని జనసేన నాయకుడు మహంతి శివ అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో తమకు తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యాయని ఎమ్మెల్యే లోకం నాగమాధవి చొరవతో కుళాయి పనుల ప్రారంభమయ్యాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ టొంపల సీతారాం, కిలారి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దానా మాస్టారుకు కవి సత్కారం

ప్రజాశక్తి - రామభద్రపురం

విజయవాడలో నిర్వహిస్తున్న ప్రపంచ తెలుగు మహాసభలో ప్రముఖ కవి, సాహితీవేత్త స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు కిలపర్తి దాలినాయుడు (దానా మాస్టర్)కు కవి సత్కారం నిర్వహించారు. ప్రముఖ చలన చిత్ర గీత రచయిత భువనచంద్ర, ప్రపంచ తెలుగు సభల నిర్వాహక ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్ చేతులు మీదుగా కవి సత్కారం చేశారు. దాలి నాయుడు మాస్టారు రచించి, గానం చేసిన వివిధ పద్యాలకు భువన చంద్ర ఆనందం వ్యక్తం చేసి రచన గానం బాగున్నాయని కొనియాడి మీరు వాగ్గేయకారులు అని వేదికపైనే అభినందించడం గర్వకారణం అని దానా మాస్టారు సంతోషం వ్యక్తం చేశారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - గజపతినగరం

మొక్కజొన్న, అపరాల పంటలలో తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కొత్తబగ్గాం, పాత బగ్గాం గ్రామాలలో రైతులకు నిర్వహించిన శిక్షణ తరగతులలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి గోవిందమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి ముంపు పరిస్థితులలో నీటిని బయటికి తీసివేసి అపరాల పంటలలో ఎకరాకు యూరియా 15కిలోలు చల్లుకోవాలని, తెగుళ్లు, పురుగు ఉధృతి తగ్గించుకోవడానికి 400ఎంఎల్ ఫైప్రోనిల్, 200 ఎంఎల్ ప్రొపికోనజోల్ 200 లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న పంటలో ఎకరాకు యూరియా, పోటాష్ ఎరువులను వెంటనే అందించి, పురుగు తెగుళ్ల నివారణకు బెంజోయిట్, ప్రొపికోనజోల్ మందును పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ ధనలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు సౌజన్య, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటి కులగణన చేపట్టాలి

ప్రజాశక్తి - వంగర

తప్పులు తడకలుగా ఉన్న రాష్ట్ర ఎస్‌సి కుల గణన ఆడిట్ నిలుపుదల చేసి ఇంటింటా కుల గణన చేపట్టాలని దళిత బహుజన సంఘాల జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వంగర మండల కేంద్రం అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్ళతో నిరసన చేసి, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం గణపతి, రాజు, అప్పలస్వామి, సుధీర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధికి సహకరించాలి

శృంగవరపుకోట: పంచాయతీ అభివృద్ధికి అందరూ సహకరించాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోష్ కుమారి అన్నారు. పట్టణంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం ఆమె అధ్యక్షతన పంచాయతీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కి సంతాపం తెలియజేశారు. అనంతరం సమావేశంలో డ్రైనేజీ, రోడ్లు, తాగునీటిపై చర్చ జరిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి అనురాధ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్యం మొండి వైఖరి వీడాలి

ప్రజాశక్తి-చీపురుపల్లి

వెంకట రామా పౌల్ట్రీ యాజమాన్యం తన మొండి వైఖరిని విడనాడి కార్మికులకు న్యాయం చేయాలని సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ డిమాండ్ చేశారు. ఈ నెల 27వ తేదీ నుంచి మండలంలోని కర్లాం గ్రామం సమీపంలో ఉన్న వెకట రామా పౌల్ట్రీ వద్ద తమ డిమాండ్లను నెరవేర్చాలంటూ కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో నిరవధిక సమ్మెను చేపట్టారు. ఇందులో భాగంగా యాజమాన్యం, కారికులు శనివారం చర్చలు జరిపారు. యాజమాన్యం తరుపున సిజియం పరుచూరి హరికృష్ణ, జనరల్ మేనేజర్ గౌరి, హెచ్‌ఆర్ జయరాజ్‌లు కార్మికుల తరుపున సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ, అంబళ్ల గౌరినాయుడు, స్థానిక సిఐటియు నాయకులు ఇప్పిలి గురునాయుడు, ఈశ్వరరావులు చర్చలలో పాల్గొన్నారు. చర్చలు విఫలం కావడంతో తిరిగి నిరవధిక సమ్మెను కార్మికులు కొనసాగిస్తున్నారు. వంటా వార్పును కూడా పరిశ్రమకు ముందే కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు రమణ మాట్లాడుతూ ఈ ఏడాది మే 31తో పాత వేతన ఒప్పందం

సిఐటియు నాయకులు టివి రమణ

సిఐటియు నాయకులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సత్యవాణి

పూర్తయిందని జూన్ 1వ తేదీ నుండి కొత్త వేతన ఒప్పందం జరగాల్సి ఉంది. కాని నేటి వరకు ఆ ఒప్పందం జరగలేదని అన్నారు. చర్చల పేరుతో యాజమాన్యం కాలయాపన చేస్తోందన్నారు. ఏడు నెలలు అయినప్పటికీ యాజమాన్యం నూతన ఒప్పంద వేతనానికి అంగీకరించకుండా మొండి వైఖరి అవలంభిస్తోందన్నారు. ఏడు నెలలలో కనీసం ఐదు దపాలు యాజమాన్యంతో చర్చలు జరిగాయనీ, డిసియల్ దగ్గర నాలుగు దపాలు, వైజాగ్ జెసియల్ దగ్గర మూడు దపాలు చర్చలు జరిగాయనీ ఎక్కడా కార్మికులకు న్యాయం జరగలేదని అన్నారు. అప్పటి నుండి 15 రోజుల మేర నల్ల రిబ్బన్లు పెట్టుకొని విధులు నిర్వహించామన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే నిరవధిక సమ్మెకు వెలతామని మూడు నెలల కిందటే నోటీసులిచ్చామని గుర్తు చేశారు. పోలీసులను పెట్టి సమ్మెను అణగ దొక్కాలని యాజమాన్యం చూస్తోందని అందులో భాగంగానే శనివారం ఉదయం పోలీసులతో కార్మికులను బయటకు తోసేందుకు యాజమాన్యం చూసిందన్నారు. సమస్య పరిష్కరించకుంటే కంపెనీలో ఏమి జరిగినా దానికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని రమణ హెచ్చరించారు. అనంతరం సాయంత్రం సమ్మె వద్దకు చేరుకున్న ఆర్‌డిఒ సత్యవాణి, డిఎస్‌పి రాఘవులు ఇటు యామాన్యం, అటు కార్మికులతో చర్చించినప్పటికీ ఫలితం లేకపోవడంతో కార్మికులు సమ్మెను కొనసాగిస్తున్నారు.

మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు

తోటపల్లి కాలువ గట్టే దళితులకు మరుభూమి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడలో ఉన్న 45 దళిత కుటుంబాలకు మరుభూమి లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం గ్రామానికి చెందిన కొంగరాపురాజు అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో శ్మశానవాటిక లేక గ్రామ శివారు తోటపల్లి పిల్ల కాలువ గట్టుపైనే పూడ్చారు. పంట పొలాల్లో గట్లపై వెళ్లి అంత్యక్రియలు చేయవలసిన పరిస్థితి ఉందని దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన వాటికల మంజూరు చేయాలని పాలకులకు, అధికారులకు ఎన్నోసార్లు వినతి పత్రాలు అందించినా ఫలితం లేదన్నారు. దళిత కుటుంబాలకు శ్మశాన వాటిక లేక ఎవరైనా చనిపోతే ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు శ్మశాన వాటికను మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

రూ.10వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భోగాపురం

పశువుల పాక కాలిపోయిన బాధితుడికి జనసేన నాయకులు రూ.10 వేలు ఆర్థిక సహాయం శనివారం అందజేశారు. ఏ రావివలస పంచాయతీ అమటం గ్రామానికి చెందిన దువ్వ అప్పన్న పశువుల పాక ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయింది. ఆ గ్రామానికి చెందిన జనసేన నాయకులు దల్లి శ్రీను, మండల జనసేన పార్టీ అధ్యక్షులు వందనాల రమణ, కోరాడ వెంకటరమణ కలిపి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బొల్లు త్రినాథ్, రాధారెడ్డి, సత్యనారాయణ, శంకర్, రామ్ సూరి, బంగారప్పుడు తదితరులు పాల్గొన్నారు.

'ఏం పాపం చేశామని మాకీ శిక్ష'

ప్రజాశక్తి- చీపురుపల్లి

'మేమేం పాపం చేసామని మాకీ శిక్ష.. మాకు ఒన్‌బిలు, అడంగల్ రాక బ్యాంకులు రుణాలివ్వడం లేదు.. ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పు తీసుకుందామంటే కుదరడం లేదు.. ఆడ పిల్లల పెళ్లిళ్లకు మాకున్న కాస్త భూమి అమ్ముకొని పెళ్లి చేద్దామంటే అమ్మడానికి కుదరడం లేదు. మమ్మల్ని ఎందుకు ఇలా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఎన్ని దపాలు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోరా' అంటూ మండలంలోని రామలింగాపురం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన రైతులు రీ సర్వేల మూలంగా తమ భూముల వివరాలను సంబంధిత రెవెన్యూ సిబ్బంది ఇష్టా రాజ్యంగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారని దీంతో తాము పూర్తిగా నష్టపోయామని చెప్పారు. తమ భూములను వేరొకరి పేరున వేరొకరి భూములను తమ పేరున రికార్డులలో నమోదు చేయడం వల్ల గ్రామంలో ఉన్న రైతులందరూ ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. జాయింట్ ఎల్‌పియం నెంబర్లు ఇవ్వడం వల్ల రైతుల మధ్య గొడవలు తలెత్తి గ్రామంలో మనస్సాంతి లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. సదస్సులో

రెవెన్యూ సదస్సులో రైతులు ఆవేదన

అధికారులను నిలదీస్తున్న రైతులు

తహశీల్దారు రాజారావు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పి. సుదర్శన రావు కోరారు. శనివారం కొండ గుంపాం, ఎల్‌ఎన్‌పురంలో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి సదస్సులు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్ డిటి ఎం.సత్య నారాయణ, సర్వేయర్ దివ్య, విఆర్‌ఒలు వెంకట లక్ష్మీ, సూరిబాబు, సన్యాసిరావు, నాయకులు మహంతి వెంకటరావు, పతివాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని పెదదుంగాడలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 9 దరఖాస్తులు స్వీకరించినట్లు తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. ముందుగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిటి సన్యాసినాయుడు, ఎంఆర్‌ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్, సచివాలయ సర్వేరు, గ్రామ పెద్దలు సేనాపతి అప్పారావు, మాజీ సర్పంచ్ కొప్పల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చింతలవలస సర్పంచ్ కలిశెట్టి సూర్యనారాయణ అధ్యక్షతన శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. చింతలవలస, అమరాయవలస గ్రామాలకు చెందిన రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. తహశీల్దార్ మాట్లాడుతూ 15గ్రామ పంచాయతీల నుంచి ఇప్పటి వరకు 125 వినతులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పిన్నింటి నారాయణ, బైరెడ్డి కృష్ణ, ఆర్‌ఐ, మండల సర్వేయర్‌తో పాటు ఆయా గ్రామాల విఆర్‌ఒలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఛార్జీల పాపం జగన్‌దే

ప్రజాశక్తి- భోగాపురం

విద్యుత్తు ఛార్జీలు పెంచిన పాపం గత వైసిపి ప్రభుత్వాని దేనిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. భోగాపురంలోని పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛార్జీలు పెంచిన వారే ధర్నాలు చేయడం దారుణమన్నారు. జగన్మోహన్ రెడ్డి నిర్వాకంతో రాష్ట్ర ప్రభుత్వంపై, ప్రజలపై 32 వేల కోట్ల విద్యుత్ భారం పడిందన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిటిసి దాసరి అప్పలస్వామి, నాయకులు నీలాపు అప్పలరామిరెడ్డి, బొడ్డ హరిబాబు, రవణబాబు, నండ ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: వైసిపి హయాంలో పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలే నిరసన చేయడం సిగ్గు చేటు, ఛార్జీలు పెంపు పాపం జగన్‌దేనని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. ఆయన శనివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విద్యుత్తు ఛార్జీలను పెంచి ఇప్పుడు ఏమీ ఎరగనట్లు నిరసనలు చేయడం వారికే చెల్లిందని విమర్శించారు. తన పాలనలో రాష్ట్ర విద్యుత్ రంగంపై దాదాపు రూ.1.30 లక్షల కోట్లు భారాన్ని జగన్ మోపింది నిజం కాదా? అని ప్రశ్నించారు. యూనిట్‌కు ఐదు రూపాయలకు దొరికే విద్యుత్‌కు బదులు రూ.8 నుంచి 14 రూపాయల వరకు కొనుగోలు చేసి ప్రజలపై జగన్ రెడ్డి మోయలేని భారాన్ని మోపారన్నారు. 2022 నుంచి 2024 వరకు రెండేళ్ల కాలానికి రూ.17 వేల కోట్ల ట్రూఅప్ ఛార్జీలను పెంచాలని ఆనాడే జగన్ సర్కార్ ఆమోదించిందని గుర్తు చేశారు. ఆ ట్రూ అప్ ఛార్జీలనే ప్రస్తుతం డిసెంబర్ నుంచి అమలు చేయాలంటూ ఈఆర్‌సీ ఉత్తర్వులు ఇచ్చిందని చెప్పారు. కరెంట్ ఛార్జీల పెంపునకు, కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం సంబంధం లేదని స్పష్టం చేశారు.

శృంగవరపుకోట: మాజీ ముఖ్యమంత్రి జగన్ నాడు చేసిన అవినీతి విద్యుత్తు వ్యవస్థను నాశనం చేయడమే కాక ప్రజలపై ఛార్జీల భారం పడిందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. లక్కవరపుకోట కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గత టిడిపి హయాంలో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పిపిఎ) ద్వారా 25 సంవత్సరాలకు యూనిట్ విద్యుత్తు ధర 4.86 రూపాయలకు సరఫరా చేసేలా ఒప్పందం చేసుకుంటే దాన్ని నిర్వీర్యం చేసి జగన్ అవినీతి కోసం కొత్త దారులు తొక్కారని అన్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో ఎనిమిది సార్లు పైగా విద్యుత్ ఛార్జీలు పెంచారని గుర్తు చేశారు. అవినీతి చేసి ఆ పాపాన్ని జనం నెత్తిన వేసిన జగన్ నేడు కూటమి ప్రభుత్వాన్ని నిందించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఎల్.కోట మండల పార్టీ అధ్యక్షులు చుక్కాకుల ముల్లు నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు(సాయిరాం), గూడుపు బ్రహ్మాజీ, బూత్ ఇంచార్జ్ శ్రీను, కోళ్ల కృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకును ప్రారంభించిన తరువాత మాట్లాడుతున్న జిఎం శాలినీ మీనన్, మేనేజర్ హేమలత

యూనియన్ బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చింతలవలసలో అతి పెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయనగరం ప్రాంతీయ కార్యాలయం తమ 70వ శాఖను ప్రారంభించింది. బ్యాంకు జనరల్ మేనేజర్ శాలినీ మీనన్ ఈ బ్యాంకును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు ఖాతాదారులకు అనువైన అనేక డిపాజిట్, ఋణ పథకాలను అందిస్తోందన్నారు. ఆ కోవలో యూనియన్ సంపూర్ణ డిపాజిట్ 456 రోజులకు అత్యధిక వడ్డీతో అందిస్తున్నామని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ మేనేజర్ నరేష్, బ్రాంచి మేనేజర్ హేమలత, గ్రామ పెద్దలు, ఖాతాదారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తడిసిన వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- డెంకాడ

మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు తప్పవని, తుపాను కారణంగా తడిసిన, మొలకెత్తిన, రంగు మారిన ధాన్యాలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. తుపాను వల్ల దెబ్బతిన్న వరి పంటను మండలంలోని గుణుపూర్‌పేట, గునుపూరు పొలాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు ఇబ్బంది పెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా ఇబ్బంది పెడితే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, ఏవో ఈ నిర్మల, జనసేన నాయకులు పైల శంకర్, చింతపల్లి రామ్మూర్తి, తొత్తడి ప్రకాశరావు, రైతులు పాల్గొన్నారు.

నిలిచిన ఇంటర్నెట్ సేవలు

భోగాపురం: బిఎస్‌ఎన్‌ఎల్ ఇంటర్నెట్ సేవలు శనివారం నిలిచిపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనులకు ఆటంకం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా ప్రభుత్వానికి ఆదాయం వచ్చే సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషనలకు ఆటంకం ఏర్పడింది. ఫలితంగా రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ప్రజాశక్తి- రాజాం

అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపిడిఒపై దాడికి వ్యతిరేకంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపిడిఒ శ్రీనివాసురావు నల్ల బ్యాడ్జీలతో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిడిఒపై దాడి చేయడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించలేని సమావేశాలెందుకు?

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు అధికార్లను నీలదీశారు. శనివారం స్థానిక నగర పంచాయతీ సమావేశం భవనంలో చైర్‌పర్సన్ బంగారు సరోజినీ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు సమస్యలు పరిష్కరించలేనపుడు ఇలాంటి సమావేశాలు ఎందుకు నిర్వహిస్తారని మండిపడ్డారు. టిడిపి కౌన్సిలర్ అవనాపు సత్యనారాయణ, వైసిపి కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, మొయిద శ్రీనివాస రావు గత కొన్ని నెలలుగా మొయిద జంక్షన్ సినిమా హాల్ ఆవరణలో అనుమతి లేకుండా నిర్మించిన బహుళ అంతస్థుల కన్వేషన్ భవనంపై అధికార్లు ఎందుకు చర్యలు తీసుకోలేదని కుమ్మక్కు అయ్యారా అని నీలదీశారు. పలుమార్లు అక్రమ నిర్మాణం పై ఫిర్యాదులు చేస్తున్నా చర్యలు తీసుకోకుండా అధికార్లు మౌనం వహించడం ఏమిటని ప్రశ్నించారు. పేదవారు ఇల్లు కట్టుకుంటే అనుమతులు లేవని అఘామేఘాల మీద వచ్చి వారిపై చర్యలు తీసుకుంటారు గాని అక్రమ నిర్మాణాలు జరిపిన బడా బాబులు జోలికి వెళ్ళారా? అని ఆగ్రహించారు. దీంతో బాటు పలు వార్డుల్లో వీధి లైట్లు వెలగడం లేదని, తాగు నీరు కూడా సక్రమంగా సరఫరా అవ్వక పోవడంపై మండిపడ్డారు.

అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశాల్లో ప్రతీసారి లేవనేత్తుతున్న సమస్యలు అధికార్లు కనీసం సమాధానం చెప్పనప్పుడు సమావేశాలు ఎందుకని టీలు, బిస్కెట్‌ల కోసం నిర్వహిస్తున్నారా అని నీలదీశారు. సమావేశంలో సమస్యలపై తమ కంఠ శోష తప్ప అధికార్లలో చలనం రాదా అని ప్రశ్నించారు. ఇంత జరిగినా అధికార్లు 2024-25 సవరణ బడ్జెట్ అంచనాలు, 2025-26వార్షిక బడ్జెట్‌ను రూ.12.13కోట్లు ఆదాయం గాను, ఖర్చు రూ.9.50 కోట్లు, ముంగిపు నిల్వ రూ.2.63కోట్లు మిగులు బడ్జెట్‌గా ప్రకటించి ముగించేశారు. ఈ సమావేశంలో కమిషనర్ కె. అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

చోరీ దొంగలు దొరికారు..

ప్రజాశక్తి- గజపతినగరం

మండలంలోని మధుపాడలో జరిగిన చోరీ కేసులో దొంగలు దొరికారు. ఈ కేసును ఒక్క రోజులో గజపతినగరం ఎస్ఐ కె. లక్ష్మణరావు అత్యంత చాకచక్యంగా చేదించి దొంగలను, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ. సివివి రమణ వెల్లడించారు. మధుపాడ గ్రామానికి చెందిన తెన్నేటి నరసింహమూర్తి ఇంట్లో ఈనెల రెండో తేదీన చోరీ జరిగింది. ఆ సమయంలో హైదరాబాద్ క్యాంపులో ఉన్న నరసింహమూర్తి కుటుంబం ఈనెల 27వ తేదీన ఉదయం స్వగ్రామమైన మధుపాడ వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి చూడగా బీరువాలు తెరిచి, ఇల్లంతా చిందరవందరగా ఉండడంతో వెంటనే గజపతినగరం పోలీసులకు ఉదయం 11 గంటలకు ఇంటి యజమాని నరసింహమూర్తి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే మదపాడ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో హుండీ చోరీకి గురైనట్లు మరో ఫిర్యాదు అందింది. వెంటనే ఈ కేసును దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ లక్ష్మణరావు తన సిబ్బందితో కలిసి శనివారం మధ్యాహ్నం మధుపాడ పాలధార చెరువు వద్ద దొంగలను చోరీ సొత్తుతో సహా చాకచక్యంగా పట్టుకున్నారు. వారు వద్ద నుంచి మూడు కేజీల వెండి, రెండు కేజీల ఇత్తడి సామాగ్రి, ఎల్ఈడి టీవీ స్వాధీనం చేసుకున్నారు. హుండీలో అపహరించిన సుమారు పదివేలు నగదు, హుండీని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీలో ప్రధాన పాత్రధారుడైన అదే గ్రామానికి చెందిన తూముల దానయ్యతో పాటు, మరో ఇద్దరు మైనర్‌లను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.

5 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి- కొత్తవలస

ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఇందిరా దేవి ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్‌వి రామారావు, సిబ్బంది మండలంలోని రామలింగాపురంలో సిమ్మ అచ్చన్నని శనివారం 5 లీటర్ల నాటు సారాతో పట్టుకుని, కేసు నమోదు చేశారు. రైడ్‌లో హెచ్‌సి నాగేశ్వరరావు, రాంబాబు ఈసీ నాయుడు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలు పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని 39 పంచాయతీలలో 66 గ్రామాలకు సంబంధించి 2023-24 ఏడాదికి సంబంధించి రూ.25కోట్లతో జరిగిన ఉపాధి హామీ పనుల్లో సామాజిక తనఖీలు పారదర్శకంగా నిర్వహించాలని వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెంనాయుడు, వావిలపల్లి జగన్ మోహన్ రావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎస్ఆర్‌పిలు, డిఆర్‌పిలు ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 17 విడత సామాజిక తనిఖీల్లో పంచాయతీరాజ్, ఉపాధిహామీ పథకం, ఆర్డబ్ల్యూఎస్, ఎస్ డబ్ల్యూఎస్, ఎస్‌హెచ్‌జి లకు సంబంధించి వివిధ రకాల పనులకు గ్రామాల వారీగా ఆడిట్ నిర్వహించి పారదర్శకంగా నివేదికలు తయారు చేయాలని సూచించారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకూ లోన్ కాకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి ఎస్ సత్యన్నారాయణ, ఎస్ఆర్‌పి కె.మన్మధరావు, ఎపిఒ సంకాబత్తుల హరినాథ్, ఈసి రామినాయుడు, డిఆర్‌పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫోర్ట్ సిటీ పాఠశాలలో లెర్నింగ్ ఫెస్ట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని ఫోర్టుసిటీ పాఠశాలలో శనివారం లెర్నింగ్ ఫెస్ట్ ఘనంగా జరిగింది. రాష్ట్ర, సిబిఎస్ఇ విద్యార్థులు కలిపి సుమారు 800 ప్రాజెక్టులను ప్రదర్శించి తమ సృజనాత్మకతను చాటారు. వైజ్ఞానిక, సాంస్కృతిక, ఇతర విషయాలను వివరిస్తూ విద్యార్థులు ఉపాధ్యా యులుగా, తల్లిదండ్రులు విద్యార్థులుగా తమ పాత్రను పోషించారు. గణితం సైన్సు సంబంధి ంచిన ప్రాజెక్టులను మాత్రమే కాకుండా తెలుగు, హిందీ, ఇంగ్లీషు, సోషల్, కంప్యూటర్, వ్యాయా మవిద్య, ఎటిఎల్, ఆర్ట్స్, డాన్స్, సంగీతం తదితర విషయాలపై విద్యార్థులు వివరించారు. పాఠశాల ఛైర్మన్ కె.ఎ.పి.రాజు(శివ) విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి విద్యా వైజ్ఞానిక

వివిధ వేషధారణలో విద్యార్థినులు

ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని, విద్యార్థుల విద్యావ్యాప్తికి బాగా దోహదపడతాయని అన్నారు. పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రీయినా ఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్ నీలిమా ఫెస్ట్‌లో పాల్గొని ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులకు, సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఎంపిడిఒపై దాడి చేసిన వారిని అరెస్ట్ చెయ్యాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్నమయ్య జిల్లా గాలివీడులో ఎంపిడిఒ జవహర్ బాబు పై దాడి చేసిన జి.సుదర్శన్ రెడ్డిని,అతని అనుచరులను వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు కంది వెంకటరమణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంపిపి ఛాంబర్ తాళాలు ఇవ్వలేదని, ఇటీవల కాలంలో ప్రభుత్వ విధులు సక్రమంగా నిర్వహించే ఉద్యోగులపై పైరవీలు చేస్తూ వారుచెప్పినట్లు తప్పుడు పనులకు సహకరించకపోతే దౌర్జన్యం చేయడం,దాడులకు తెగబడడం ఎక్కువైనదని ఇలాంటి వారికి తగిన బుద్ధి చెప్పడం ద్వారా ఉద్యోగులలో మనోధైర్యాన్ని పెంచాలని కోరారు.